# దగ్ధ కర్మలు

మనం పుట్టినప్పటి నుంచి చనిపోయేంత వరకూ రోజు ఎన్నో కర్మలు చేస్తూనే ఉంటాం. కాని మనకు కర్మ అంటే ఏమిటి? కర్మలు ఎలా చేస్తే కర్మ, తలరాతకు అతీతంగా చేరతాం? మనం ఇరుక్కు పోయిన పాప-పుణ్యాలనే చక్రం నుంచి బయటపడి మన కర్మలను ఎలా దగ్ధం చేయాలి? ఆనందమయ జీవితాన్ని ఎలా పొందాలి అనే విషయాలు మనకు తెలియవు. వీటి గురించి స్పష్టమైన అవగాహన లేకపోయినా ప్రతీ రోజు మనకు తోచిన విధంగా కర్మలు చేస్తూ, అనుకున్నది జరగకుంటే కర్మ, తలరాత అని సర్దుకుపోతున్నాం. వీటి గురించి అనుభవపూర్వకంగా తెలుసుకున్నది ఇప్పుడు మీకు వివరిస్తాను.

ప్రతి ఆత్మకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర తత్వాలు ఉంటాయి. కాని జీవాత్మ అయిన మనం ఈ విషయాన్ని మరచి అసంపూర్ణంగా జీవిస్తున్నాం. ఎలాగైతే ఒక అణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ కలిసి ఉంటాయో అదే విధంగా ప్రతీ కర్మలో - సృష్టించడం, నడిపించడం, నశింపచేయడం అనేవి 3 కలిసి సమపాళ్ళలో ఉంటాయి. ఈ విశ్వంలోని ప్రతి అణువు ఈ 3 స్థితులతోనే నిండి ఉంటుంది. వీటినే మనం మంచి-చెడు-తటస్థంగా, లేదా తమో-రజో-సత్వ గుణాలుగా చెప్పవచ్చు. బ్రహ్మ సత్వ గుణానికి, విష్ణు రజో గుణానికి, మహేశ్వరుడు తమో గుణానికి అధిపతులుగా ఉన్నారు. కనుక ఈ ముగ్గురు కలిసి కట్టుగా అన్యోన్యంగా పని చేస్తేనే మనిషి జీవితం సంపూర్ణమవుతుంది.

బ్రహ్మ యొక్క పని - కర్మను సృష్టి చేయడం. ఉదాహరణకి తిట్టరా అనే ఆలోచన నాకు వచ్చింది, ఇది నాలోని బ్రహ్మ సృష్టి చేశాడు. అలాగే కర్మను నడిపించడం విష్ణువు యొక్క పని, అంటే ఆ తిట్లకు కావాల్సిన శక్తిని మరియు సామర్థ్యాన్ని అందిస్తూ దానిని నడిపిస్తాడు. అలాగే ఆ కర్మను నాశనం చేయడం లేదా దగ్ధం చేయడం మహేశ్వరుడి పని.

కాని ఆలోచన వచ్చిన వెంటనే మీరు కర్మ చేస్తే, ఆ కర్మ మీ మనసులో స్టోర్ అవుతుంది. అలాగే కేవలం ఈ ఒక్క పని వలననే కొందరికి మంచి జరుగుతుంది, కొందరికి చెడు జరుగుతుంది. ఉదాహరణకి మీరు శాఖహారిగా ఉంటూ, మాంసాహారాన్ని ద్వేషిస్తే - మీకు శాఖాహారుల పట్ల రాగం, మాంసాహారుల పట్ల ద్వేషం ఉంటుంది. దీని వలన కొందరికి శత్రువులుగా, మరి కొందరికి మిత్రులుగా తయారవుతున్నారు. అంటే ఒకేసారి మంచి-చెడు కర్మ చేస్తూ, దానికి తగిన ప్రతిఫలాన్ని పొందుతూ వాటిలో ఇరుక్కుపోతున్నారు.

దీనికి పరిష్కారం జ్ఞానాగ్ని పుట్టించి దానిలో గత కర్మలన్నింటినీ దగ్ధం చేయడం. ఇలా చేయాలంటే మీరు శివతత్వాన్ని కూడా ఉపయోగించుకోవాలి. కాని మీ జీవితంలో మీరు కేవలం బ్రహ్మ, విష్ణువుల యొక్క తత్వాలనే ఉపయోగిస్తున్నారు, శివ-తత్వాన్ని ఉపయోగించుకోవటం

లేదు. అంటే సృష్టి చేయడం దానిని కొనసాగించడం మీదనే దృష్టిపెడుతున్నారు గానీ, సృష్టించిన వాటిని ఎలా లయం చేయాలి అనే దాని గురించి ఆలోచించడం లేదు.

శివుడు ఏదైనా ఒక పని లేదా కర్మ యొక్క కాలం తీరిన తరువాత దానిని నాశనం చేస్తాడు. శివుడు లయకారక తత్వానికి అధిపతిగా ఉంటూ ఆ పాత్రను పోషిస్తాడు. డిలీట్ ఆప్షన్ లేదా శివతత్వం అనేది మనకు చాలా అవసరం, ఎందుకంటే పుట్టినది ఏదైనా నశించక తప్పదు, ఇదే సృష్టి యొక్క నియమం. కాని అజ్ఞానంలో తెలియక మీరు శివతత్వాన్నే ద్వేషిస్తున్నారు. ఇప్పటి నుంచి దీనిని ఉపయోగించుకోవడం మొదలుపెట్టండి. మన లోపలే డిలీట్ ఆప్షన్ ఉంది. అంటే మన లోపలే బ్రహ్మ-విష్ణు-మహేశ్వర తత్వాలు ఉన్నాయని గ్రహించండి.

మీరు స్వచ్ఛం కావాలంటే డిలీట్ ఆప్షన్‌ని ఎలా ఉపయోగించుకోవాలో తప్పకుండా తెలుసుకోవాలి. మీకు ఎవరినైనా తిట్టమనే ఆలోచన రాగానే - వెంటనే బయట తిట్టకుండా, అంతరంలో తిడతాను, పొగుడుతాను, న్యూట్రల్ అని మూడింటిని ఎంపిక చేసుకోండి. అంటే బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులను ఎంపిక చేసుకోండి. అలాగే త్రిమూర్తుల కలయిక స్థితికి చేరిన తర్వాత తిడతానని ఆ ఆలోచనకు చెప్పి, ప్రశాంత స్థితికి వచ్చిన తర్వాత మీకేదనిపిస్తే అది చేయండి.

మీరు ప్రతీ రోజు ఈ విధంగా సాధన చేస్తే మీరు తప్పకుండా ఏ ఆలోచనలు వచ్చినా రియాక్ట్ కాని స్థితికి చేరుతారు. ఎప్పుడైతే మీరు రాగ-ద్వేషాలకు అతీతంగా చేరి కర్మ చేస్తారో అనగా డైరెక్టర్‌గా ఉంటూ పాత్రలను పోషిస్తారో, అప్పుడు మీరు చేసే కర్మలన్నీ దగ్ధ కర్మలౌతాయి.

నేను క్లాసు చెబుతున్నప్పుడు, అందరిని తిడుతూ ఉంటాను, పొగుడుతూ ఉంటాను, అన్ని రకాల పదాలను ఉపయోగిస్తాను. ఆ క్లాసులో అన్ని రకాల వాళ్లు ఉంటారు. పేషెంట్లు, డాక్టర్లు, సైంటిస్టులు, టీచర్లు... అందరూ వాటిని సరదాగా తీసుకుంటూ ఉంటారు. మామూలుగా మనం ఎవరినైనా తిడితే వాళ్ళు ఊరుకుంటారా? ఎవ్వరూ ఊరుకోరు. కాని నేను తిట్టినా కూడా అందరూ సరదాగా తీసుకుంటున్నారు, ఎందుకంటే నేను స్వచ్ఛంగా ఉండి కర్మ చేస్తాను కనుక. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కలయిక స్థితిలో ఉండి తిడతాను. నేను తిట్టే తిట్టు లేదా పొగడ్త, బ్రహ్మ ద్వారా సృష్టింపబడుతుంది, అదే సమయంలో విష్ణువు ద్వారా నడిపింపబడుతుంది, అదే సమయంలో శివుడి ద్వారా లయం చేయబడుతుంది. దీనినే దగ్ధ కర్మలు అంటారు.

అంటే నా మెమరీకార్డులో దగ్ధ కర్మలకు సంబంధించి ఏది స్టోర్ కాదు. నేను ఒక వేళ ఈ స్థితిలో ఉండి కర్మ చేయకుంటే అప్పుడు అవి అంతరంలో స్టోర్ అవుతాయి. దీనిని నేను గుర్తించి, ఆ కర్మలన్నింటినీ ప్రశాంతంగా దివ్యంగా చూడగలిగే స్థితికి చేరేంత వరకు మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకుని అనుభవించి దగ్ధం చేస్తాను. మనం చేసిన కర్మలు అంతరంలో డిలీట్ కాకపోవడం వలననే, బాహ్యంగా

వాటికి సంబంధించిన కర్మలు మనకు రీపీట్ అవుతాయి. డిలీట్ చేసిన తర్వాతే ఆ సమస్య మాయమౌతుంది. డిలీట్ చేయడం గురించి మరింత సమాచారం కోసం అంతర్ ప్రయాణం చదవండి.

యోగులు కర్మలు చేస్తారు కానీ వాటికి అంటుకుని ఉండరు. కర్మలకు అతీతముగా ఉంటారు, వాళ్ళకు ఏ కర్మలు అంటవు. తామరాకు మీద నీటి బొట్టులా ఉంటారు. అంటే ఏది వాళ్ళ మెమరీ కార్డులో స్టోర్ కాదు.  కానీ మీరు కర్మలు చేస్తే వెంటనే మీ మెమరీ కార్డులో స్టోర్ అవుతున్నాయి.

ఉదాహరణకి మీ మొబైల్‌లోని మెమరీ కార్డులో ఏవో పాటలు స్టోర్ చేస్తుంటారుగా. మనం కొత్తవాటిని స్టోర్ చేయాలంటే దానిలో ఖాళీ ఉండాలి. లేకుంటే పాత వాటిని డిలీట్ చెయ్యాలి కదా! అలాగే మన మనసు కూడా మెమరీ కార్డులాంటిదే. దానిలో స్టోర్ అయి ఉన్న అనవసరమైన వాటిని డిలిట్ చెయ్యాలి, దీనినే నేను దగ్ధం చేయడం లేదా జ్ఞానాగ్ని పుట్టించడం అంటున్నాను.

ప్రాపంచికంగా మొబైల్‌లో ఉన్న మెమరీ కార్డ్ ఉదాహరణను చెప్పవచ్చు, కానీ ఆధ్యాత్మికంగా గత కర్మలను డిలీట్ చెయ్యడం ఎలా అనేది తెలుసుకోవాలి. ఏదైనా మీరు సృష్టి చేస్తే, దానిని మీరే నడిపించాలి, తర్వాత దానిని మీరే నాశనం చెయ్యాలి. మీరు సృష్టి చేయకుంటే నాశనం చేయవలసిన అవసరం లేదు. అంటే మీరు పరమాత్మ స్థితిలో ఉండి కర్మ చేస్తే అనగా త్రిమూర్తులు ఏకమైన తర్వాత కర్మ చేస్తే, అది ఎక్కడా స్టోర్ కాదు.

కర్మ చేసినా మన లోపల స్టోర్ కాకుండా ఉండాలంటే మనమేమి చెయ్యాలి? అంటే అన్ని పాటలు వినాలి, కాని మెమరీకార్డులో స్టోర్ కాకూడదు. దీనికి మీరు ఏమి చెయ్యాలి? 24 గంటలూ మీకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉంటే సరిపోతుంది. అప్పుడు మనకు వినాలనిపించినప్పుడు పాటలు వింటాము కాని ఏదీ మెమరీకార్డులో స్టోర్ కాదు. దీనినే నేను కర్మ చేసినా కూడా దానికి అంటకుండా ఉండడం లేదా దగ్ధ కర్మలు అని అంటున్నాను.

అలాగే విశ్వమంతా పరమాత్మ వ్యాపించి ఉన్నాడు. ఎక్కడైనా ఎప్పుడైనా ఆయనతో మనం కనెక్షన్ పెట్టుకోవచ్చు, wi-fi తో కనెక్షన్ పెట్టుకున్నట్టుగా. కనుక ఆయనతో మీరు ఎల్లప్పుడు కనెక్షన్ పెట్టుకుని కర్మలు చేయాలి. అంటే దైవంతో ఉండి మీరు ఏ కర్మ చేసినా, లేదా డైరెక్టర్‌గా ఉండి మీరు ఏ పాత్ర పోషించినా అవి దగ్ధకర్మలౌతాయి. అంటే పరమాత్మ శక్తి స్వచ్ఛమైన రూపం ధరిస్తుంది, కొద్ది సేపు ఉంటుంది, పని అయిన వెంటనే స్వచ్ఛమై పరమాత్మలోనే తిరిగి కలిసిపోతుంది. మధ్యలో ఎక్కడా స్టోర్ కాదు. ఇలా చేయడం వలన మీ సమస్యలన్నీ మటు మాయం. ఈ సాధన మీరు చేసి చూడండి, తేడా మీకే అర్థం అవుతుంది.

అలాగే దగ్ధకర్మలు చేస్తే ఫలితాలు వస్తాయి అని చెప్పాం కదా అని, చాలా మంది ఈ సాధన చేస్తే ఈ ఫలితం వస్తుందని ఆశించి చేస్తున్నారు. అందుకే వారికి ఫలితాలు రావడం లేదు. కనుక

మీరు ఆశిస్తున్నప్పుడు వెంటనే దానిని గుర్తించి, నేను ఏమీ ఆశించకుండా సాధన చేస్తాను, లేదా అన్నీ రకాల ఫలితాలను ఆశిస్తాను, లేదా ఈ సాధన చేస్తే ఏమి ఫలితం వస్తుందో నాకు తెలియదు, అది రహస్యమైనదని అనుకోండి. ఆ తర్వాత సాధనను కొనసాగిస్తూ ఏమి జరుగుతుందో వేచి చూడండి.

సృష్టి-స్థితి-లయం ఏకకాలములో జరిగిపోతే వాటిని దగ్ధ-కర్మలని అంటారు. దగ్ధ-కర్మలు తిరిగి మీ దగ్గరకు రావు. ఎందుకంటే అవి మీలో స్టోర్ కాలేదు కనుక. ఒకవేళ ఆ కర్మకు ఫలితం తిరిగి వచ్చినా మీపై ఎలాంటి ప్రభావం చూపించదు, ఎందుకంటే మీరు స్వచ్ఛంగా ఉంటారు కనుక.

ఎప్పుడైతే మీరు దగ్ధ కర్మలు చేస్తారో, అప్పుడు మీరు అద్భుతమైన ఫలితాలు సాధిస్తారు. అప్పటి వరకు అసాధ్యం, కర్మ అని అనుకున్న వాటన్నింటికీ, దగ్ధ-కర్మలు చేయడం వలన పరిష్కారాలు లభిస్తాయి. ఎందుకంటే శివుడు కూడా మీకు తోడైనాడు కనుక. ఏ సమస్యకైనా పరిష్కారం లభించిందనుకోండి, అప్పుడు కూడా మీరు కర్మ, తలరాత అని అంటారా? అనరు కదా.

మీ కర్మలన్నీ దగ్ధమౌతున్నప్పుడు, స్వచ్ఛంగా చిన్న పిల్లల్లా మారిపోయి గంతులేస్తూ ఉంటారు. మీకు ప్రస్తుతం ఉన్న సమస్యలు క్లియర్ అయినప్పుడు గతంలో వేసిన పాత్రలు ఈ విషయాన్ని గమనిస్తాయి. ఒకే నేను బ్రహ్మ-విష్ణువులను మాత్రమే ఉపయోగించుకున్నాను కానీ శివుడిని ఉపయోగించుకోలేదని గ్రహించి, వాటంతటవే వాటి కర్మలను దగ్ధం చేసుకుంటాయి. స్టోర్ అయినా పాత కర్మలు కూడా ఈ జ్ఞాన-వీచిక ద్వారా దగ్ధమవుతాయి. ఇలా చేస్తే మొత్తం కర్మ-చక్రము నుండే బయటకు వచ్చి, ముక్తి పొంది స్వచ్ఛమైన స్థితిలో ఉండి హాయిగా జీవితాన్ని ఆనందంగా, సంతోషంగా గడుపుతారు.

కనుక ఇప్పటి నుండి మీరు కూడా దగ్ధ కర్మలు చెయ్యండి. ఇలా సాధనను కొనసాగిస్తే మీరు స్వచ్ఛమైన స్థితికి చేరి స్వచ్ఛమైన శక్తిని ఉపయోగించుకుని జీవితాన్ని ఆనందంగా గడుపుతారు. దీని వలన మీరు ఇరుక్కుని ఉన్న పాప-పుణ్య కర్మల నుండి విడుదల అయ్యి, బయట పరిస్థితులు ఎలా ఉన్నా కూడా వాటికి మీరు అంటకుండా లోపల ప్రశాంతంగా ఉంటారు.

** ఈ లింక్‌ని క్లిక్ చేసి ఆడియోలు వరుసగా వింటే మరియు టాపిక్స్ చదివితే, మీకు న్యూఎనర్జీ-అద్వైతం కాన్సెప్ట్ స్పష్టంగా అర్థమవుతుంది. http://darmam.com/important-topics.html